క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జి సన్మానం



పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి ప్రవళికను బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం సన్మానించారు. నూతనంగా ఎన్నికైన బార్ అసిసోయేషన్ ప్రెసిడెంట్ కుమారస్వామి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాద పూర్వకంగా సమావేశమై సన్మానించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్



పిడుగురాళ్ల: ప్రైవేటు పాఠశాలలో నడుపుతున్న ఫిట్నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. సాయికుమార్ మాట్లాడుతూ... పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఎన్నో ప్రైవేటు పాఠశాలలు ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతున్నాయని, వాటిని వెంటనే సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు రోహిత్, నాయకులు కొమ్ము బెనర్జీ, నరేంద్ర పాల్గొన్నారు.

పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుర్రి శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని మిట్టమీదిపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మడతల వెంకటరెడ్డి, హనిమిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహిరంగ ధూమపానం నిషేధం

పిడుగురాళ్ల: బహిరంగంగా ధూమపానానికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ మోహన్ హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్, ఐలాండ్ సెంటర్ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానానికి పాల్పడేవారిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

17న దేవాలయ భూముల కౌలు వేలం

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 12.61 ఎకరాల భూములు, రెంటాల గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి చెందిన 1.16 ఎకరాల భూముల కౌలు హక్కుల వేలం గురువారం నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిట్టగుడిపాడు దేవస్థానంలో మధ్యాహ్నం 3 గంటలకు, రెంటాల దేవస్థానంలో సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని చెప్పారు. పాటలో పాడుకున్న రైతులు 2025–2026 నుంచి 2027–2028 వరకు మూడేళ్ల పాటు కౌలు హక్కును పొందనున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

కారెంపూడి: కౌలు రైతు కార్డుల మంజూరు కోసం పొలం కౌలుకు సాగు చేస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆర్. వెంకటేశ్వర్లు నాయక్ కోరారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయశాఖ అధికారి పోట్ల నరసింహారావుతో కలసి తహసీల్దార్ సోమవారం సంబంధిత శాఖల ఉద్యోగుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులందరూ కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భూ యజమాని అంగీకార పత్రం ఫారం 1 కూడా దరఖాస్తుతో పాటు జత చేయాలని కోరారు. మండలంలో 1,711 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికి 282 కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. వారంలోగా మిగతా వారందరికి కౌలు రైతు కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు సంబంధిత శాఖల ఉద్యోగులను ఆదేశించారు.

పోలు వెంకటరెడ్డి సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే కాసు



వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

గురజాల: అందరి మనస్సుల్లో మంచి వాడిగా పేరు తెచ్చుకున్న నాయకుడిగా పోలు వెంకటరెడ్డి నిలిచిపోయారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కొనియాడారు. నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోలు వెంకటరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కాంస్య విగ్రహావిష్కరణ సోమవారం నిర్వహించారు. కాంస్య విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కాసు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో మంచి పేరును చిన్నతనం నుంచి మంచితనంను సంపాదించుకున్న నాయకుడిగా ఎదిగాడన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వీరంరెడ్డి అమరారెడ్డి, నగర పంచాయతీ మాజీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలపూడి అశోక్, కలకండ అంద్రెయ్య పాల్గొన్నారు.

శ్మశానం అభివృద్ధికి చర్యలు ..... పోలు వీరారెడ్డి

గ్రామంలో శ్మశానం అభివృద్ధికి తమవంతు 25 లక్షలు అందిస్తామని పోలు వెంకటరెడ్డి కుమారుడు వీరారెడ్డి తెలిపారు. వెంకటరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో పోలు వీరారెడ్డి, అమరారెడ్డి కుటుంబ సభ్యులు కలిసి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా శ్మశానం అభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు.

లక్ష్మారెడ్డిని పరామర్శించిన కాసు

పిడుగురాళ్లరూరల్: కార్యకర్తలకు అండగా ఉంటామ గురజాల మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. టీడీపీ మూకల దాడిలో గాయపడిన నర్రెడ్డి లక్ష్మారెడ్డిని గురజాల మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి సోమవారం జూలకల్లులోని లక్ష్మారెడ్డి స్వగృహంలో పరామర్శించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు నర్రెడ్డి కృష్ణారెడ్డి, శేషిరెడ్డిలు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అందరం కలిసి వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పోరాటం చేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, ఎంపీపీ గార్లపాటి అనసూర్య వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పిటీసీ వీరభద్రునిరామిరెడ్డి, సర్పంచ్ ఎల్. స్వరూప, ఎల్. అంకారావు, ఎంపీటీసీ రాంబాబు, ముడేల వెంకటేశ్వరరెడ్డి, బీరవల్లి రామిరెడ్డి, ఎస్‌డీఎల్(కృష్ణారెడ్డి), శ్రీనివాసరెడ్డి, అజయ్, సుభాని పాల్గొన్నారు.



టీడీపీ మూకల దాడిలో గాయపడిన లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

డ్రైయినేజీ లేకుండా రోడ్డా!

- సగం దూరం మురుగు కాలువ
- సగం డ్రైయినేజీ లేకుండా పనులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



డ్రైయినేజీ లేకుండా రోడ్డు నిర్మాణం కోసం తీసిన మట్టి

దాచేపల్లి: రోడ్డు నిర్మాణంలో డ్రైయినేజీ వ్యవస్థ లేకుండా పనులు చేపట్టారు. వివరాలు.. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్ నుంచి నడికుడి వార్డు సచివాలయం వరకు రెండవ దశ పనులను అధికారులు చేపట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్ రెడ్డి నడికుడి రైల్వే స్టేషన్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు సుమారుగా నాలుగు కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్ నుంచి నడికుడి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి వరకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించి తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది కాలం పాటు ఈ పనులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా ఈ రోడ్డు రెండో దశ పనులను చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సుమారుగా 800 మీటర్ల దూరం పనులు చేసేలా అధికారులు చర్యలు తీసుకొని యంత్రాలతో రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణ తొలగించి మట్టి తీసే పనులు చేస్తున్నారు. ఈ పనులు చేస్తుండగా స్థానికులు డ్రెయినేజీ నిర్మాణంపై అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం డ్రెయినేజీ పనులు ఏమి చేయటం లేదని, కేవలం తారురోడ్డు నిర్మాణ పనులు మాత్రమే చేస్తున్నట్లుగా అధికారులు చెబుతునానరు. రోడ్డు నిర్మాణ పనులకు తాము వ్యతిరేకం కాదని, డ్రెయినేజీ నిర్మించకుండా రోడ్డు నిర్మిస్తే తాము ఇబ్బందులు పడతామని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి నీళ్లన్నీ ఇళ్లల్లోకి వస్తున్నాయని, డ్రెయినేజీ నిర్మించకుండా రోడ్డు నిర్మిస్తే తాము నివసిస్తున్న నివాస గృహాలు నీళ్లలోనే తేలాడుతుంటాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణంతో పాటు డ్రెయినేజీని కూడా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్‌బీ ఏఈ సుబ్బారావును వివరణ కోరగా.. ప్రస్తుతం తారు రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నామని, నగర పంచాయతీ నిధులు కేటాయించి డ్రెయినేజీలను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

వ్యవసాయ సహాయ సంచాలకులు కన్నయ్య



అచ్చంపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు



రాజుపాలెం బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

అచ్చంపేట: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు, అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ కార్యాలయ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కన్నయ్య, విజిలెన్స్ సీఐ అపర్ణ స్థానిక ఎరువులు, పురుగు మందు షాపు యజమానులను హెచ్చరించారు. సోమవారం వారు అచ్చంపేట, పెదపాలెం గ్రామాలలోని ఎరువులు, పురుగు మందు షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలించారు. స్టాక్ వివరాలను ఏరోజుకు ఆరోజు స్టాక్ బోర్డులో ఉంచాలని, ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే లైసెన్సు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతుకు కొనుగోలు బిల్లు ఇవ్వాలని, పంట కాలం పూర్తయ్యేంత వరకు జవాబుదారీగా ఉండాలన్నారు. పురుగు మందుల శాంపిల్స్‌ను నాణ్యత పరీక్షలకు పంపాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో అచ్చంపేట, పెదపాలెం ఎరువులు, పురుగుమందు విక్రయ డీలర్లు పాల్గొన్నారు.

56 ఎరువుల బస్తాలు సీజ్

రాజుపాలెం: మండల కేంద్రం రాజుపాలెంలోని బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిలువ ఉంచిన 56 ఎరువుల బస్తాలను విజిలెన్స్ సీఐ ఎస్ఎన్ఎస్ అపర్ణ సీజ్ చేశారు. మండల కేంద్రంలోని బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ షాపులో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ అపర్ణ, ఏడీఏ కె.కన్నయ్య పాల్గొన్నారు. తనిఖీలలో స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించగా ఫారం లేకుండా అమ్మకాలు జరపడం, ఈ పోస్ మిషన్లో నమోదు చేయకపోవడం వలన రూ.66,770 విలువ చేసే 56 ఎరువు బస్తాలను సీజ్ చేసి షాపు నిర్వాహకుడు కొరివి వెంకటేశ్వరరావుపై 6ఏ కేసు నమోదు చేశారు. అదే విధంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు లేనటువంటి రూ.58,962 విలువ గల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య, అచ్చంపేట మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిల తనిఖీ

మాచర్ల: పట్టణంలోని లాడ్జిలను పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమానితులను విచారించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు లాడ్జిల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి ఆధారం, అనుమానితులను లాడ్జిల్లోకి అనుమతించకూడదని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని లాడ్జి యజమానులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

నేడు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

సత్తెనపల్లి: ప్రతిభావంతులైన 20 మంది పేద విద్యార్థులకు డాక్టర్ చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో శబరిగిరి అపార్ట్‌మెంట్ వద్ద ఉపకార వేతనాలు పంపిణీ జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది చిట్టా భరద్వాజ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రతిభ గల 20 మంది నిరుపేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష నగదు ఆర్థిక సహాయంగా అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వివరాలకు 9440226993 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఏఈ మస్తాన్‌వలి

రెంటచింతల: సౌర విద్యుత్‌ను అందరికీ చేరువ చేసి సుస్థిర ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పీఎం సూర్య ఘర్ యోజన గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తుందన్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. 200 యూనిట్లు లోగా విద్యుత్‌ను వినియోగించుకుంటున్న ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ కనెక్షన్ కలిగిన స్వంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకంకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని కలిసి సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పలు గ్రామాలలో 30 సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలకు చెందిన 2,554 మంది, ఇతర సమాజిక వర్గాలకు చెందిన మరో 2,691 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఏఈ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఐలాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ వర్కర్స్, సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: మున్సిపల్ ఇంజినీరింగ్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల సెక్రటరీ తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సోమవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండు రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పని మానేసి తమ హక్కుల కోసం పోరాడుతుంటే కూటమి ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. వెంటనే చర్చలకు పిలిచి పరిష్కారం చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని రిటైర్మెంట బెనిఫిట్స్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గద్దె శ్రీనిషసారావు, కొప్పూరి రమేష్, కొక్కెర శ్రీనివాసరావు, మోహన్‌రావు, మధు, పవన్ కుమార్, పూర్ణ పాల్గొన్నారు.

‘ఎర్రవాగు’ భూములకు బాట కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న పీడీఎం, ప్రజా సంఘాల నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎర్రవాగు పరిసర ప్రాంతాల రైతుల భూములకు బాట కల్పించాలని పీడీఎం, ప్రజా సంఘాల నాయకులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... పట్టణంలోని ఎర్రవాగు పరిసర ప్రాంతాల రైతుల భూములకు బాట, పంట కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. బాట దాదాపు వందేళ్ల నుంచి ఉందని, కాల క్రమంలో కొంత మంది బాటను ఆక్రమించుకొని కలుపుకున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్వే చేసి బాట ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా అక్కడ ఉన్నటువంటి 30, 40 ఎకరాల భూమికి పంట కాలువలు లేక కొన్ని సంవత్సరాలుగా నీటికి అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు సామాజిక కార్యకర్త వెంకట్రావు, తెల్లబాటి కృష్ణ, తెల్లబాటి రాఘవరావు, పిచ్చయ్య, శ్రీను, మణి, పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు యరగాని లడ్డు, యడవెల్లి కొండలు పాల్గొన్నారు.

పెన్షనర్స్ పెండింగ్ బకాయిల విడుదలకు డిమాండ్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌కు పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్సీ అరియర్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సోమవారం ఆయన కోరారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన ఫైనాన్స్ వాలిడేషన్ ఎమెండ్‌మెంట్ రద్దు చేయాలన్నారు. 12వ పే కమిషన్ వెంటనే నియమించాలన్నారు. కమ్యూటేషన్ 15 సంవత్సరాలకు బదులుగా 11 సంవత్సరాలకు కుదించాలన్నారు. రైలు, విమాన ప్రయాణాలలో సీనియర్ సిటిజన్స్‌కు కన్సెషన్ పునరుద్ధరించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికై జరుగు ధర్నాకు జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్ ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు రెండు మండలాలు ఎంపిక

రాజుపాలెం: ఆయిల్ పామ్ సాగుకు జిల్లాలో 8 మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మండంలోని గణపవరంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ అవగాహన సమావేశం వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సరీ్వసెస్ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగుకు సత్తెనపల్లి, రాజుపాలెం మండలాలను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు నీరు సమృద్ధిగా ఉండాలని తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు పంట కుంటలు నిర్మించుకొనుటకు రూ.75 వేలు రాయితీ అందజేయడం జరుగుతుందని, రైతులు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.రాంమోహన్‌రావు, ఉద్యాన శాఖ అధికారి ఎస్‌కే నబీరసూల్, నరసరావుపేట వ్యవసాయాధికారి పి.నర్సయ్య, మండల ఉద్యాన శాఖాధికారి ఎం.నవీన్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కుర్చీలు, ప్లేట్లు అందజేత

రొంపిచర్ల: మండలంలోని కర్లకుంట ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన మండలపు రంగమ్మ తన భర్త వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.15 వేల రూపాయల విలువ చేసే 4 కుర్చీలు, 63 భోజనం ప్లేట్లను సోమవారం అందజేశారు. సదావర్తి అన్నదాన సత్రం నుదురుపాడు వారు విద్యార్థులకు అవసరమైన పలకలు, నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేష్, గ్రామ పెద్దలు వడ్లమూడి కిషోర్, నిడమానులూరు దాసయ్య, శ్రీనివాసరావు, కట్టా వెంకట్రావు, తుర్లపాటి నాగేశ్వరరావు, వడ్లమూడి సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్ సాగుతో నిరంతర ఆదాయం



విత్తనాలను సిద్ధం చేస్తున్న రైతులు, సిబ్బంది

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్ పద్ధతిలో సాగు చేస్తే రైతులు 365 రోజులు నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం క్రోసూరు డివిజన్ ఎంటీ జయలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు టి.శ్రీనివాసరెడ్డి 30 సెంట్ల భూమిలో ఏటీఎం మోడల్ విధానాన్ని వేశారు. ఈ సందర్భంగా ఎంటీ మాట్లాడుతూ ఈ మోడల్ విధానంలో ముందుగా భూమిని చదును చేసి నాలుగు అడుగుల వెడల్పు బెడ్లుగా, ఒక అడుగు నీటి కాలువలుగా ఏర్పాటు చేసి ఆ బెడ్లపై 18 రకాల దుంప, తీగ జాతి, ఆకుకూరలు, కూరగాయలు, బోర్డర్ క్రాప్‌గా మొక్కజొన్న వేయాలని తెలిపారు. ఏటీఎం మోడల్‌లో ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆహార ఉత్పత్తులను తినడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. భూమి 365 రోజులు పచ్చగా ఉంటుందని, పండించిన కూరగాయలు, ఆకుకూరల ద్వారా రైతుకు నిరంతరం ఆదాయం వస్తుందని తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జిలు కె.జ్యోతి, బి.శ్రీనివాసరెడ్డి, టి.మాధవి, సావిత్రి, ఐసీఆర్పీలు అంకమ్మరావు, యలమందమ్మ, తిరుపతమ్మ, నరసింహారావు, జ్యోతి, సమరసింహారావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

ఎంఈఓ బాలసుందరరావు

బెల్లంకొండ: ఓపెన్ స్కూల్ విద్యా విధానం ద్వారా చదువుకునేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంకొండ ఎంఈవో–2 బాలసుందరరావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యాసకులు నేరుగా ఆన్‌లైన్‌లో గానీ, గ్రామ సచివాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు బెల్లంకొండ జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వినుకొండలో భారీ అగ్నిప్రమాదం

వినుకొండ: పట్టణంలోని హనుమాన్‌నగర్ జీరో లైన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. మంటలు భారీగా వ్యాపించడంతో చుట్టుపక్కల వారు భయాందోళనలతో పరుగులు తీశా రు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. అసలు ప్రమాదం ఎందుకు జరిగింది?, ఎలా జరిగింది అనేది బాధితుల నుంచి సమాచారం రావాల్సి ఉంది.

జాతీయ అవార్డు గ్రహీత మురళికి సత్కారం



సత్తెనపల్లి: జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డ్‌కు ఎంపికైన సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళిని చత్రపతి కళా పరిషత్ సభ్యులు పూల మాలలు, దుశ్శాలువతో సోమవారం ఘనంగా సన్మానించారు. అమరావతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్నకర్నాటి మురళి ఆగస్టు 7న ఢిల్లీలో భారత్ భవనంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అరుదైన జాతీయ అవార్డు అందుకోనున్నారు. జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం సత్తెనపల్లి పట్టణానికే గర్వకారణమని మురళి ప్రతిభను చత్రపతి కళా పరిషత్ సభ్యులు పులహరి గోవిందు, వెంకోజీ, భవాని ప్రసాదు, యర్రా ఆదినారాయణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పులిహరి బానోజీ, వెంకటేశ్వర్లు, ఫిరోజీ, శివాజీలు కొనియాడారు.